క్లుప్తంగా

నేటి నుంచి రాచపోలమాంబ ఆలయ వార్షికోత్సవం



రాచపోలమాంబ అమ్మవారు

అల్లిపురం : భక్తుల కొంగు బంగారం రాచపోలమాంబ అమ్మవారి ఆలయ వార్షికోత్సవం 8,9,10 తేదీల్లో ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా మూడు రోజుల పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. అల్లిపురం మెయిన్‌రోడ్డులో గల అమ్మవారి సతకం పట్టు వద్ద, చెరువుగట్టున గల అమ్మవారి ప్రధాన దేవాలయంలో ప్రత్యేక పూజలు, కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకోవాలని విజ్ఞప్తి చేశారు.

దోమల నిర్మూలనతోనే వ్యాధులకు చెక్



దొండపర్తిలో మలేరియా అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

సీతమ్మధార: జీవీఎంసీ 27వ వార్డులో గల దొండపర్తి పట్టణ ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం మలేరియా అవగాహన మాసోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి శ్రావణి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వారం పైబడి నీటి నిల్వలుంటే దోమలు వృద్ధి చెందుతాయన్నారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే-డ్రైడే కార్యక్రమం నిర్వహించాలన్నారు. దీనికి ప్రజల సహకారం అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా విభాగం హెల్త్ అసిస్టెంట్ ఎల్.శ్రీను, జీవీఎంసీ మలేరియా హెల్త్ అసిస్టెంట్ శివ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వంశీకృష్ణకు సత్కారం



ఎమ్మెల్యే వంశీకృష్ణను సత్కరిస్తున్న వైజాగ్‌పటం ప్రతినిధులు

అల్లిపురం : వైజాగ్‌పటం ప్రతినిధులు శుక్రవారం దక్షిణ ఎమ్మెల్యేగా గెలిచిన వంశీకృష్ణ శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కృష్ణాగార్డెన్స్‌లో గల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వంశీని కలిసిన క్లబ్ కార్యదర్శి రాజు పాత్రుడు, న్యాయవాది, మాజీ పీపీ సలాది శ్రీనివాస్ తదితరులు గజమాలతో ఎమ్మెల్యేను సత్కరించారు. ఈ సందర్భంగా వారు క్లబ్ పని తీరును ఆయనకు వివరించారు.

నేడు వైభవుడికి సుప్రభాత సేవ

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహించనున్నారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్టి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరుగుతాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి విశేష హారతులు సమర్పిస్తారు.

ఘన చరితకు నిలువెత్తు సాక్ష్యం..

- బీచ్‌రోడ్డులోని హవా మహల్
- వందేళ్లు పైబడినా నేటికీ అదే ఠీవి
- ఎందరో ప్రముఖులకు ఆతిథ్యమిచ్చిన నెలవు

వందేళ్లకు మించిన చరిత్ర ఆ పురాతన కట్టడానిది. అనంత సాగరానికి అభిముఖంగా కాలానికి ఎదురొడ్డి ఠీవిని ప్రదర్శిస్తోంది. రాజుల హయాంలో రూపొందింది.. తర్వాతి కాలంలో ఎందరో ప్రముఖులకు ఆతిథ్యమిచ్చింది. అనంతర కాలంలో విశాఖలో రూపొందిన మొట్టమొదటి మహిళా కళాశాలగా మారి ఎంతో మందికి విద్యనందించింది. అదే.. నేటికీ బీచ్ రోడ్డులో మనకు కనిపించే హవా మహల్.



నాటి కళాకారుల పనితనానికి మెచ్చుతునక ఈ కట్టడం



చెక్కుచెదరని హవా మహల్



ఇలాంటి బలమైన స్తంభాలు ఈ భవంతిలో ఎన్నో..



వందేళ్ల కిందట హవా మహల్

దాబాగార్డెన్స్ : విశాఖ బీచ్‌రోడ్డులోని హవా మహల్ ఎవరినైనా ఇట్టే ఆకట్టుకుంటుంది. పలు సినిమాల్లో సైతం కనిపించిన ఈ కట్టడానికి ఎంతో విశిష్ట చరిత్ర ఉంది. ఒకప్పటి జైపూర్ ఎస్టేట్‌లోని కొంత భాగం (ఇప్పటి పాడేరు, అనంతగిరి, అరకు) మద్రాసు ప్రెసిడెన్సీ పరిధిలో ఉండేది. జైపూర్ మహారాజులు రాకపోకలు సాగించేందుకు వీలుగా విశాఖలో గుడారాలు వేసుకుని విడిది చేసేవారు. ఈ నేపథ్యంలో విశాఖలో ఒక విడిది గృహాన్ని నిర్మించాలని అప్పటి మహారాజా రామకృష్ణ దేవ్ సంకల్పించారు. 1913వ సంవత్సరంలో సాలూరు జమీందార్ వద్ద మూడున్నర ఎకరాల భూమిని కొనుగోలు చేసి నిర్మాణ పనులు ప్రారంభించారు. 1917లో నిర్మాణం పూర్తయింది. ఆంధ్ర విశ్వవిద్యాలయానికి అప్పట్లో విశ్రాంతి భవనాలు లేకపోవడంతో అప్పట్లో ఏయూకి వచ్చే అధికారులు, అతిథులు ఈ హవా మహల్‌లోనే బస చేసేవారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్, పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, విశ్వకవి రవీంద్రనాథ్ టాగూర్ తదితర ప్రముఖులు అప్పట్లో ఇక్కడే బస చేయడం విశేషం. రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో ఆర్మీ హెడ్ క్వార్టర్లను ఈ భవనంలోనే ఏర్పాటు చేశారు. ఇది 1945 వరకు ఇక్కడే కొనసాగింది. జమీందారి విధానం రద్దయిన తర్వాత ప్రభుత్వం నామమాత్రపు అద్దెపై హవా మహల్‌లో నర్సింగ్ స్కూల్ ఏర్పాటు చేసింది. 1980 నాటికి అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళ్రావు హయాంలో జైపూర్ మహరాజా అనుమతితో విశాఖ ఉమెన్స్ కళాశాలను ఏర్పాటు చేశారు. 1991లో కళాశాలను సౌత్ జైల్ రోడ్డుకు మార్చారు.

అద్భుత రాతి కట్టడం..

రాజుల కోటను తలపించే ఈ భవనం రెండంతస్తుల రాతి కట్టడం. దీనిని రెండు భాగాలుగా నిర్మించారు. రోడ్డుపై నుంచి కనిపించేది ప్రధాన భవనం. వెనుకనున్నది కిచెన్ కాంప్లెక్స్. రెండు కట్టడాలకు ఒకే పై కప్పు నిర్మించారు. భవనం మధ్యలో వృత్తాకారంలో ఆర్చిలు, కట్టడానికి ఇరువైపులా సంప్రదాయబద్ధంగా సిమెంట్ కలశాలు నిర్మించారు. హవా మహల్ ముందు, వెనుక భాగాల్లో అర్ధ వృత్తాకారంలో వరండాలు, ఉత్తర, దక్షిణాల్లో రూఫ్ వరండాలు ఉన్నాయి. పై అంతస్తుకు చేరుకునేందుకు గుండ్రటి ఇనుప మెట్లను ఏర్పాటు చేశారు. భవనం వెనుక సర్వెంట్, వాచ్‌మెన్‌లు ఉండేలా నిర్మించారు.

మొదటి ప్రధాని నెహ్రూ, తొలి రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్‌లకు ఆతిథ్యం..

నాటి ఎంతో మంది గవర్నర్లు, రాజకీయ ప్రముఖులకు ఆతిథ్యం ఇచ్చిన హవా మహల్ మన దేశపు తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూకు కూడా ఆతిథ్యం ఇచ్చింది. 1961లో హిందుస్తాన్ షిప్‌యార్డు మొట్టమొదటి సారిగా రూపొందించిన జల ఉష నౌకను సాగర ప్రవేశం చేయించేందుకు విశాఖ విచ్చేసిన నెహ్రూ హవా మహల్‌లోనే బస చేశారు. అలాగే మన దేశ మొట్టమొదటి రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్ విశాఖ విచ్చేసిన సందర్భంగా ఆయన కూడా హవా మహల్‌లోనే బస చేయటం అపూర్వమని చెప్పాలి.

నేడు ధర్మశాస్త ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

అల్లిపురం : టూటౌన్ పోలీస్ స్టేషన్ దరి శ్రీ శివరామకృష్ణ దేవస్థానంలో వెలసిన శ్రీ ధర్మశాస్త ఆలయ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ గురుస్వామి నీలాపు రమణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు భార్గవ శర్మ ఆధ్వర్యంలో అయ్యప్పస్వామికి పంచామృతాభిషేకాలు, అర్చనలు, విశేష అలంకరణ అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఈ పూజా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని అయ్యప్పస్వామి ఆశీస్సులు పొందాలని కోరారు.

మూతపడిన వాకింగ్ ట్రాక్



వైశాఖి స్పోర్ట్స్ పార్కులో వాకింగ్ ట్రాక్

మురళీనగర్: మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కులోని వాకింగ్ ట్రాక్‌ను కొద్ది రోజులు మూసి వేస్తున్నట్లు పార్కు అధ్యక్షుడు సనపల వరప్రసాద్, కార్యదర్శి పీవీఎస్ రాజు తెలిపారు. మట్టితో నిర్మించిన ఈ వాకింగ్ ట్రాక్ మరమ్మతులు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఈ నెల 11 వరకు మూసివేసి, 12వ తేదీన తిరిగి తెరుస్తామని వారు చెప్పారు. సభ్యులు, వాకర్లకు సమాచారం నిమిత్తం నోటీసు బోర్డులో పెట్టామన్నారు. వాకర్లు సహకరించాలని వారు కోరారు.

ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరాలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న తెలుగు ఉపాధ్యాయుడు సంజీవ్‌కుమార్



బాలల శాఖా గ్రంథాలయంలో పిల్లలకు అట్టలు, పెన్నులు, పెన్సిళ్లు అందజేస్తున్న నిర్వాహకులు



దేవీపురంలోని శివాలయంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

దాబాగార్డెన్స్ : జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గత కొంత కాలంగా నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలు శుక్రవారంతో ముగిసాయి. తెలుగు ఉపాధ్యాయుడు డి. సంజీవ్‌కుమార్ ముగింపు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పట్టుదల ఉంటే సాధ్యం కానిదేదీ లేదని, గ్రంథాలయాలను ఉపయోగించుకుని లక్ష్యాన్ని సాధించే దిశగా అడుగులు వేయాలన్నారు. గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్‌సీహెచ్ వెంకట్రావు మాట్లాడుతూ కలలు కనండి.. వాటిని సాకారం చేసుకోండి.. అని కలాం చెప్పిన మాటలు విద్యార్థులకు గుర్తు చేశారు. సామాజిక కార్యకర్త కేవీఎస్ నరసింహం మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వ్యాస రచన, వక్తృత్వం, చిత్రలేఖనం, క్రాఫ్టువర్క్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డిప్యూటీ లైబ్రేరియన్ పీవీ నూకరాజు, లైబ్రేరియన్ రాజేంద్రవర్మ, సిబ్బంది పాల్గొన్నారు.


బాలల శాఖా గ్రంథాలయంలో..

జీవీఎంసీ 36వ వార్డు పరిధి రంగిరీజువీధిలో గల బాలల శాఖా గ్రంథాలయంలో గత నెల 4 నుంచి నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరాలు శుక్రవారంతో ముగిసాయి. విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు డ్రాయింగ్, మ్యూజికల్ చైర్, లెమన్ స్పూన్, క్విజ్, వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు ముగింపు రోజున బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న అన్నమా పాఠశాల తెలుగు ఉపాధ్యాయురాలు కరణం జయంతి, ఎం. చిట్టి నాయనమ్మ, టి. కుసుమ, ఎస్. ఎల్లయ్య విజేతలైన చిన్నారులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా కరణం జయంతి మాట్లాడుతూ వేసవి శిబిరంలో విద్యార్థులు కథలు, పద్యాలు, డ్రాయింగ్, యోగాలో శిక్షణ పొందారని, ఆటల పోటీల్లో పాల్గొన్నారని తెలిపారు. అందరినీ అభినందించారు. ఈ సందర్భంగా పిల్లలకు బిస్కెట్లు, చాక్లెట్లు, పెన్నులు, పెన్సిళ్లు, స్కేళ్లు అందజేశారు. గ్రంథాలయ అధికారి టి. పోలితల్లి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

పిల్లల ఆధ్యాత్మిక యాత్ర..

వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా స్వామి వివేకానంద స్వచ్ఛంద సంస్థ ట్యూషన్ పిల్లలను ఆధ్యాత్మిక యాత్రగా అనకాపల్లి, దేవీపురం తీసుకెళ్లారు. సమ్మర్ క్యాంపులో భగవద్గీత అధ్యయనం, రామాయణ, మహాభారత గాథలను బోధించారు. అనకాపల్లిలో వెలసిన నూకాంబిక దర్శనం, దేవీపురంలో గల శివాలయం దర్శించుకున్నారు. విద్యార్థులు భక్తి భావనతో నామ సంకీర్తనలు చేస్తూ, ఈ ఆధ్యాత్మిక యాత్రలో పాల్గొన్నారని సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు తెలిపారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ



క్షీరాభిషేక సేవలో కనకమహాలక్ష్మి అమ్మవారు

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన..

కనకమహాలక్ష్మి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.

త్వరితగతిన కన్వెన్షన్ సెంటర్ నిర్మాణం

పెందుర్తి: జీవీఎంసీ 95వ వార్డు చీమలాపల్లిలో కన్వెన్షన్ సెంటర్ నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని కార్పొరేటర్ ముమ్మన దేముడు అధికారులకు సూచించారు. శుక్రవారం నిర్మాణ పనులను పరిశీలించిన ఆయన పలు సూచనలు చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి తన ఎంపీ నిధులు రూ.2 కోట్లు, వీఎంఆర్‌డీఏ నుంచి రూ.2.60 కోట్లు కేటాయించారన్నారు. ప్రస్తుతం నిర్మాణ పనులు దాదాపు 70 శాతం పూర్తయ్యాయని చెప్పారు. డీఈ పట్నాయక్, నాయకులు అయిత ఎర్రయ్య, దువ్వి అప్పారావు, గంట్ల నరసింహమూర్తి, చెవ్వేటి జల్లుబాబు, వువ్వాడ త్రినాథ్, కంచిబోయిన సంతోష్, వేణు, భాగ్యలక్ష్మి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో మీ-సేవ భవనం



60వ వార్డులో శిథిలావస్థకు చేరిన మీ సేవ భవనం



భవన ప్రాంగణంలో పిచ్చిమొక్కలు, తుప్పలు

మరమ్మతు చేయించాలని స్థానికుల విజ్ఞప్తి

మల్కాపురం: నాడు లక్షల రూపాయలతో జీవీఎంసీ నిర్మించిన భవనం.. నేడు పూర్తిగా శిథిలావస్థకు చేరింది. ఒకప్పుడు జనంతో కళకళలాడిన ఆ భవనం.. ఇప్పుడు పిచ్చి మొక్కలు, తుప్పలతో కళావిహీనంగా మారింది. 60వ వార్డు గుల్లలపాలెం వుడా కాలనీ పరిధి ఎఫ్ఆర్‌యూ ఆస్పత్రి (జీవీఎంసీ) వద్ద గల మీ సేవ భవనం దుస్థితి ఇది. 2013లో ఎఫ్ఆర్‌యూ ఆస్పత్రికి ఆనుకుని 500 గజాల్లో లక్షల రూపాయల వ్యయంతో, పలు వసతులతో కూడిన భవనాన్ని అధికారులు నిర్మించారు. దానిలో మీ సేవ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. సింధియా నుంచి జింక్ వరకు పలువురు వినియోగదారులు మీ సేవ కేంద్రానికి వచ్చి పలు సేవలు పొందేవారు. మీ సేవ కేంద్రాలు మూతపడటంతో నాలుగేళ్ల నుంచి ఈ భవనానికి తాళాలు వేసి ఉంచేశారు. దీంతో ఈ భవనం శ్లాబ్ పెచ్చులు ఊడి, గోడలు పగలి, రంగులు వెలసి, ఇనప గేట్లు తుప్పు పట్టి శిథిలావస్థకు చేరింది. ఈ భవనం ప్రాంగణం మొత్తం పిచ్చి మొక్కలు, తుప్పలతో నిండింది. ఇంత విలువైన భవనానికి మరమ్మతులు చేయించి, ప్రజా అవసరాలకు ఉపయోగపడేలా తీర్చిదిద్దాలని అధికారులను స్థానికులు కోరుతున్నారు.

ఇంటర్ క్లాసులు మొదలాయె..



సీతమ్మధార పీఅండ్‌టీ కాలనీలో ఎన్ఎంసీ హైస్కూల్ ప్లస్‌లో ఇంటర్ విద్యార్థినులకు పాఠాలు బోధిస్తున్న అధ్యాపకుడు

సీతమ్మధార: ఈ నెల 1వ తేదీ నుంచి ఇంటర్మీడియట్ తరగతులు మొదలయ్యాయి. ఇంటర్ కోర్సుల్లో ప్రవేశాలు కొనసాగుతున్నాయి. సీతమ్మధార పీ అండ్ టీ కాలనీలోని ఎన్ఎంసీ హైస్కూల్ ప్లస్ బాలికల కళాశాలలో క్లాసులు ఉత్సాహంగా జరుగుతున్నాయి. పాఠశాలకు వేసవి సెలవులు కావడంతో ఇంటర్ ఫస్ట్ ఇయర్, సెకండ్ ఇయర్ విద్యార్థినులకు అధ్యాపకులు పాఠాలు బోధిస్తున్నారు. ఈ జూనియర్ కాలేజీలో ఎంపీసీలో-40 సీట్లకు గానూ 24 మంది, బైపీసీలో 40 సీట్లకు గానూ 18 మంది బాలికలు చేరారు. మిగిలిన సీట్ల భర్తీకి ప్రవేశాలు కొనసాగుతున్నాయి. ఆసక్తి గల విద్యార్థినులు ఎంపీసీ, బైపీసీ కోర్సుల్లో దరఖాస్తు చేసుకుని కళాశాలలో చేరవచ్చు.

విద్యార్థినులకు ఉజ్వల భవిష్యత్తు

విద్యార్థినుల తల్లిదండ్రులకు ఆర్థిక భారం కాకూడదని, బాలికలు ఉన్నత విద్య అందుకుని ఉజ్వల భవిష్యత్తు పొందడమే లక్ష్యంగా పలు ఉన్నత పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా సీతమ్మధార పీ అండ్ టీ కాలనీలోని జీవీఎంసీ ఎన్ఎంసీ హైస్కూల్‌ను అప్‌గ్రేడ్ చేసి ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపీసీ గ్రూప్‌లను ప్రారంభించారు. ఎంపీసీ-40, బైపీసీ-40 చొప్పున మొత్తం 80 సీట్లను బాలికల కోసం కేటాయించారు. ఫస్టియర్ చదువుతున్న విద్యార్థినులు సెకండియర్ పరీక్షలు రాసి డిగ్రీకి ప్రమోటయ్యారు.

బాలికలు సద్వినియోగం చేసుకోవాలి

ఎన్ఎంసీ హైస్కూల్ ప్లస్‌లో జూన్ 1 నుంచి ఇంటర్ క్లాస్‌లు ప్రారంభించినట్లు హెచ్ఎం రాంప్రసాద్ తెలిపారు. సీతమ్మధారలోని విశాలమైన ప్రాంగణంలో గల హైస్కూల్ ప్లస్ కళాశాలలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ అర్హతలు, అనుభవం కలిగిన అధ్యాపక బృందంచే నాణ్యమైన విద్యను అందిస్తున్నామన్నారు. ప్రభుత్వ పథకాలతోపాటు టెస్ట్‌బుక్‌లు, నోట్‌బుక్‌లు ఉచితంగా ఇస్తున్నట్లు చెప్పారు. టెన్త్ పాసైన బాలికలు సద్వినియోగం చేసుకొని ఎంపీసీ, బైపీసీ గ్రూప్‌లో చేరాలని కోరారు. ఇదే స్కూల్‌లో పదో తరగతి చదువుకుని, ఇక్కడే ఇంటర్ విద్యలో చేరి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకుంటామని విద్యార్థినులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

దివ్యాంగులు బడిబాట పట్టాలి



దివ్యాంగ చిన్నారితో అధికారులు

మల్కాపురం: బడిలో చేరకుండా ఉన్న 18 ఏళ్ల లోపు దివ్యాంగ చిన్నారులు బడిలోనే ఉండాలని జిల్లా సహిత విద్య సమన్వయకర్త బి.గీత, ములగాడ మండల విద్యా శాఖ అధికారి ఎల్.వెంకటరావు అన్నారు. ములగాడ మండలి పరిధిలో శుక్రవారం అధికారులు సర్వే చేసి, ఓ దివ్యాంగ చిన్నారిని గుర్తించారు. భవిత కేంద్రాల ద్వారా అందిస్తున్న చదువు, ఫిజియోథెరిపీ సేవలు, ప్రభుత్వం ద్వారా వచ్చే ఉపకార వేతనాలు, ఇతర రాయితీల వివరాలను చిన్నారి తల్లిదండ్రులకు వారు వివరించారు. సర్వే ద్వారా ఇప్పటి వరకు 21 మంది దివ్యాంగ పిల్లలను గుర్తించినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో అప్పలనాయుడు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో డిజిటల్ డిస్‌ప్లే బోర్డుల ఏర్పాటు

గోపాలపట్నం: సింహాచలం రైల్వే స్టేషన్‌లోని ప్లాట్‌ఫారాలపై బోగీల వివరాలు తెలిపే డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేశారు. ఎక్స్‌ప్రెస్ రైళ్లలో రిజర్వేషన్ బోగీల వివరాలు అనౌన్స్‌మెంట్‌లో తెలియజేసేవారు. ఇప్పుడు ప్రత్యేకంగా ఈ డిజిటల్ బోర్డుల ద్వారా ఎక్కడ ఏ బోగీ ఉందో ప్రయాణికులకు తెలిసే విధంగా ఏర్పాటు చేశారు. డిజిటల్ బోర్డుల వల్ల ఉపయుక్తంగా ఉంటుందని ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

బాలికల సాధికారతకు ఎన్టీపీసీ పెద్దపీట



బాలికలతో ఆర్ఐఎన్ఎల్ డైరెక్టర్ పాండే, ప్రాజెక్టు హెడ్ సిన్హా

పరవాడ: బాలికలు అన్ని రంగాల్లో రాణించేలా ఎన్టీపీసీ చేపడుతున్న కార్యక్రమాలు ప్రశంసనీయమని ఆర్ఐఎన్ఎల్ డైరెక్టర్ పాండే అన్నారు. సింహాద్రి ఎన్టీపీసీ సీఎస్సార్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన బాలిక సాధికారిత మిషన్-2024 ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగాపాల్గొని ప్రసంగించారు. పాండే వివిధ అంశాలపై చేసిన ప్రసంగం ఆకట్టుకుంది. బాలికల్లో స్ఫూర్తి నింపింది. సంస్థ ప్రాజెక్టు హెడ్ ఎస్.కె.సిన్హా మాట్లాడుతూ బాలిక సాధికారిత కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయడానికి కృషి చేసిన వారికి శుభాకాంక్షలు తెలిపారు. విద్యాపరమైన ప్రేరణ, వ్యక్తిత్వ వికాసం, సాధికారితను పెంపొందించడానికి రూపొందించిన వివిధ కార్యకలాపాలతో వర్క్‌షాపు నిర్వహించినట్టు చెప్పారు.మే 10న ప్రారంభమైన బాలిక సాధికారిత వర్క్‌షాపులో సమీప గ్రామాల నుంచి 120 మంది బాలికలు పాల్గొన్నారు. ముగింపు కార్యక్రమంలో బాలికలు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం ఆర్ఐఎన్ఎల్ డైరెక్టర్ పాండే, సంస్థ ప్రాజెక్టు హెడ్ సిన్హా చేతుల మీదుగా బాలికలకు బహుమతులు అందజేశారు.